పార్కు.. అభివృద్ధి మార్కు

- శరవేగంగా హెచ్‌బీకాలనీ ఉద్యానవనం పనులు
- రూ.6 కోట్లతో పలు హంగుల ఏర్పాటుకు చర్యలు
- స్కేటింగ్ రింక్, వాకింగ్ ట్రాక్, లైటింగ్‌తో అలంకరణ
- ఆహ్లాదాన్ని పంచేలా అందమైన మొక్కల ఏర్పాటు



హెచ్‌బీ కాలనీ పార్కులో కొత్తగా నిర్మిస్తున్న స్కేటింగ్ ట్రాక్



జోరుగా సాగుతున్న పనులు

పెదగంట్యాడ: మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల పార్కు పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పార్కు అభివద్ధి కోసం రూ.6 కోటకల నిధులు మంజూరు చేశారు. ఒక్కో దఫా రూ.2 కోట్ల చొప్పున నిధులు విడుదలయ్యాయి. దీంతో పనులు చకచకా పూర్తి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇక్కడ వాకింగ్ ట్రాక్‌ను ఆధునికంగా తీర్చిదిద్దుతున్నారు. చిన్నారుల కోసం స్కేటింగ్ ట్రాక్ సైతం ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఉద్యానవనం మొత్తం ఆహ్లాదం పంచేలా.. పచ్చదనం వెదజల్లేలా మొక్కలు నాటుతున్నారు. అలాగే పార్కులో పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ప్రత్యేంగా ఆట పరికరాలు ఏర్పాటు చేయనున్నారు. పెద్దలు సేద దీరేందుకు అందమైన బెంచీలు అమర్చనున్నారు. పార్కు మొత్తం విద్యుద్దీపాలతో అలంకరించి మిరుమిట్లు గొలిపేలా లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఈ పార్కు అభివద్ధి పనులు చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో అధ్వానం..

ప్రజలకు ఆహ్లాదం, వినోదాన్ని అందించాల్సిన ఈ పార్కు నిరుపయోగంగా పడి ఉండడంతో స్థానికులు ఆందోళన చెందేవారు. పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం కారణంగా ఈ పార్కు కాస్తా అధ్వానంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేసేవారు. పార్కు ప్రాంగణమంతా చెత్తా చెదారంతో నిండిపోయి.. డంపింగ్ యార్డ్‌ను తలపించేలా ఉండేది. అనునిత్యం విధుల్లోనూ.. ఇతర పనుల్లో నిమగ్నమైన ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర ప్రజలు కాసేపు సేదదీరేందుకు సరైన స్థలం లేకపోవడం.. పిల్లలు ఆడుకునేందుకు అవకాశం లేకపోవడంతో సమస్య ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆవేదన చెందేవారు. ఈ నేపథ్యంలో ఈ పార్కును ఆధునీకరించాలని అధికారులు నిర్ణయించారు. సువిశాలమైన 5.3 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న దీనిని కొత్తగా తీర్చిదిద్దేందుకు రంగం సిద్ధం చేశారు. అందుకు అనుగుణంగా చుట్టూ ప్రహరీ నిర్మించారు. ఆపై ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. పందులు, పశువులు అందులోకి వెళ్లకుండా ఉండేలా చర్యలు చేపట్టారు. అంతే కాకుండా స్థానికులు అందులో చెత్తా చెదారం వేయకుండా.. చీకటి పడితే మందుబాబులు లోనికి వెళ్లకుండా చూస్తున్నారు. ప్రస్తుతం లోపల స్కేటింగ్ ట్రాక్ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. గతంలో ఇక్కడ వర్షం పడితే వర్షపు నీరు నిలిచిపోయేది. రోజులకొద్దీ నీరు అలాగే నిలిచిపోతుండటంతో దోమలు వద్ధి చెందేవి. ఆపై స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేసేవి. కానీ ఇప్పుడు ఆ ప్రాంతమంతా శుభ్రంగా చదును చేశారు. వర్షం పడితే నీరు నిల్వ ఉండకుండా సాఫీగా సాగిపోయేలా ఏర్పాట్లు చేశారు. అత్యంత ఆకర్షణీయంగా.. అందమైన మొక్కలతో ఈ పార్కు రూపురేఖలు మార్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ పనులను చకచకా పూర్తి చేసి త్వరలోనే పార్కును వినియోగంలోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.



ముఖద్వారం ఏర్పాటు

వైభవంగా కన్యకాపరమేశ్వరి జయంతి



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పెదగంట్యాడ: ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో గల కన్యకా పరమేశ్వరి పంచాయతన ఆలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు త్రిమూర్తులు, ముత్యాలశెట్టి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నడుపూరు జ్ఞాన మందిరంలో అమ్మవారిని పూజిస్తున్న మహిళలు

నడుపూరు జ్ఞాన మందిరంలో..

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొడ్డు కృష్ణారావు ఆధ్వర్యంలో నడుపూరు జ్ఞాన మందిరంలో కన్యకా పరమేశ్వరి జయంతి నిర్వహించారు. ఈ మేరకు కులుకూరి మంగరాజు, సువర్ణ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో బెల్లాల వెంకటరావు, కులుకూరి శ్రీనివాసరావు, బచ్చు సోమరాజు, కట్టా సతీష్, కులుకూరి పద్మావతి, కులుకూరి రమ, కులుకూరి ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



వీరబ్రహ్మేంద్ర స్వామికి పూజలు చేస్తున్న భెల్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు

అక్కిరెడ్డిపాలెం: శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు భెల్ (హెచ్‌పీవీపీ) కమ్యూనిటీ సెంటర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. సంస్థకు చెందిన శ్రీ విశ్వకర్మ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రొడక్షన్ జీఎం, హెచ్‌ఆర్ జీఎం సి.గౌరీ శంకర్, డీజీఎం వర్మ, సీనియర్ మేనేజర్ రోలంకి శ్రీనివాసరావు, డిప్యూటీ మేనేజర్ ఐఎస్‌కే రాజులు పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి పూజలు నిర్వహించారు. భెల్ టౌన్‌షిప్‌లోని మహిళలు పెద్ద సంఖ్యలో వీరబ్రహ్మేంద్ర స్వామికి పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ప్రసాద వితరణ గావించారు. సంస్థ ఇంటక్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, పలు యూనియన్ సంఘాల నాయకులు వి.ఆనందరావు, సీతంనాయుడు, ప్రకాష్, వి.ఎస్.మూర్తి, ఎం.ప్రసాద్ తదితరులు వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.



కణితి గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటానికి పూజలు చేస్తున్న గ్రామపెద్దలు

87వ వార్డులో..

అగనంపూడి: శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు జీవీఎంసీ 87వ వార్డు కణితి విశ్వబ్రాహ్మణ సేవా సంఘం సారథ్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం, జలాభిషేకం నిర్వహించారు. తీర్థ, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో గ్రామ దేవతల కమిటీ చైర్మన్ సాగి విజయరామరాజు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, పార్టీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రగడ వేణుబాబు, సభ్యులు శృంగవరపు బ్రహ్మాజీ, సామోజు నాగేశ్వరరావు, ఎం.సునీల్, కొమ్మోజు కోటేశ్వరరావు, కణితి నాగేశ్వరరావు, నాయకులు చిత్రాడ వెంకటరమణ, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, బొండా గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా అన్న సమారాధన



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న దొడ్డి రమణ, మంజుల తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వాంబే కాలనీలో వేంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని వరాహలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు దొడ్డి రమణ ప్రారంభించారు. భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మంజుల తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

అగనంపూడి: విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ సారథ్యంలో కూర్మన్నపాలెంలోని ఉక్కు పైలాన్ వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. 1191 రోజుల నుంచి దీక్షలు నిర్వహిస్తున్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచన నుంచి విరమించుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగించాలని కోరుతూ చేపట్టిన దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉక్కు ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటించే వరకు దీక్షలు విరమించబోమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీ దళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కన్యకాపరమేశ్వరి పూజలు

దాబాగార్డెన్స్ : కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం అమ్మవారి జయంతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ కళ్యాణ మండప సంఘం, వాసవీ విజ్ఞాన మండలి, ఆర్య వైశ్య సమాజం, ఆర్య వైశ్య వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు వివిధ వాసవీ క్లబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి నిర్వహించినట్టు దేవాలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు, కోశాధికారి సుగ్గు శివకుమార్ తెలిపారు. అమ్మవారి జయంతిని పురస్కరించుకుని ఆలయంలో వేకువ జాము 3 గంటలకు సుప్రభాతంతో మొదలై అనంతరం ప్రత్యేక క్షీరాభిషేకం, ఉత్సవ మూర్తికి భక్తులచే స్వయంగా క్షీరాభిషేకం, అమ్మవారి మూలవిరాట్‌కు రజత వస్త్రాలంకరణ, 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేక పూజలు, 102 మంది మహిళలచే సామూహిక కుంకుమ పూజలు, వాసవీ మూలమంత్ర హోమం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు 108 రకాల స్వీట్స్‌తో అమ్మవారికి నివేదన చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్లు బాదం దినేష్, డాక్టర్ గోగుల సువర్ణకుమార్, కడిమిశెట్టి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ లీగ్ పోటీలు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి సెక్టార్–1లో నిర్వహించిన క్రికెట్ లీగ్ పోటీలు ముగిసాయి. కొత్తూరు యూత్ సారథ్యంలో నిర్వహించిన బోయమాంబ క్రికెట్ లీగ్ పోటీల్లో పరవాడ, గాజువాక మండలాల నుంచి జట్లు పాల్గొనగా శనివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందించారు. లోకల్ బాయ్స్ విజేతగా నిలువగా, తర్వాతి రెండు స్థానాల్లో కొత్తూరు నైట్ రైడర్స్, వీసీ బాయ్స్ జట్లు నిలిచాయి. మొదటి బహుమతిగా రూ. లక్ష నగదు, జ్ఞాపికను అందించారు. తర్వాతి రెండు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ. 50 వేలు, రూ. 25వేల చొప్పున నగదు పారితోషికం అందించారు. అతిథులుగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు దుల్ల రామునాయుడు, దాసరి త్రినాథ్, కర్రి దేవేంద్ర, నాగుబిల్లి లక్ష్మణరావు హాజరయ్యారు. నిర్వాహకులు తలారి పూర్ణ శ్రీనివాసరావు, సాలాపు వెంకటకృష్ణ, దాసరి వెంకటేష్, అరుణ్‌కుమార్, శేషు పాల్గొన్నారు.



క్రికెట్ లీగ్ విజేతలతో అతిథులు, నిర్వాహకులు

స్టీల్‌సిటీ డిపోలో చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ చటర్జీ, అధికారులు

ఉక్కునగరం: కూర్మన్నపాలెం స్టీల్ సిటీ ఆర్టీసీ డిపోలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రయాణికులు, డిపో సిబ్బంది సౌకర్యార్థం డిపోలోని టిక్కెట్ కౌంటర్ దగ్గర ఏర్పాటు చేసిన మజ్జిగ శిబిరాన్ని డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు, సిబ్బంది శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదే విధంగా ప్రయాణికుల కోసం తాత్కాలిక షెల్టర్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ పి. శ్రీనివాసరావు, సెక్యూరిటీ సూపర్‌వైజర్ సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



32వ ర్యాంకు సాధించిన పావనికి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు



మనోభిరామ్ (73వ ర్యాంకు)

ఉక్కునగరం: తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో గాజువాక జోన్ శ్రీచైతన్య విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కళాశాల విద్యార్థిని శరగడం పావని అత్యుత్తమంగా 32వ ర్యాంకు సాధించగా ఎస్. మనోభిరామ్ 73, జె. సాకేత్ సాయి 113, టి. సాయి నిఖిలేష్ 149, వి. హేమశ్రీ 237, కె. జాహ్నవి 241, బి. భవిత 309, సీహెచ్ ఐసాని 515, ఎల్. భార్గవ 543, ఎస్. శ్రుతి 561, ఎం.వి.వి.వి.బి.పి. సాత్విక్ 648, సీహెచ్‌వీ వర్షిణి 911వ ర్యాంకులు సాధించారు. ఈ ఫలితాల్లో కళాశాలకు చెందిన 70 మంది విద్యార్థులు సీట్లు సాధిస్తారని కళాశాల విశాఖ ఎగ్జిక్యూటివ్ ఏజీఏ కె.వి. రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో రమణ, ఎగ్జిక్యూటివ్ డీన్లు కె. బంగారుబాబు, ఎస్. రఘుకుమార్, ఏజీఎం పి. శ్రీనివాసరావు, డీన్లు పి. నాగేశ్వరరావు, ఎస్. మురళీకృష్ణ, ఎం.ఎల్.వి. నారాయణతో పాటు ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పాన్‌షాప్ నిర్వాహకుడిపై దాడి

మల్కాపురం: తన కుమారుడిని కొట్టాడన్న కోపంతో ఆ వ్యక్తిపై తండ్రి దాడి చేశాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా.. 63వ వార్డు జై ఆంధ్ర కాలనీలో కృష్ణస్వామి అనే వ్యక్తి పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. ఈ నెల 9న ఇదే ప్రాంతానికి చెందిన కత్తిర కనకడు అనే వ్యక్తి కుమారుడు.. కృష్ణస్వామి పాన్‌షాప్ వద్దకు వచ్చి తనకు అవసరమైన సామగ్రి తీసుకుని డబ్బులు చెల్లించలేదు. కృష్ణస్వామి, అతడి భార్య డబ్బులు ఇవ్వమని యువకుడిని అడగ్గా.. తర్వాత ఇస్తానని చెప్పాడు. డబ్బులు చెల్లించి సామగ్రి తీసుకెళ్లాలని కృష్ణస్వామి దంపతులు తెలిపారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం, తోపులాట జరిగాయి. గొడవ విషయాన్ని యువకుడు తన తండ్రి కత్తిర కనకడుకు చెప్పడంతో అతడు శుక్రవారం రాత్రి కృష్ణస్వామిని గాయపరిచాడు. బాధితుడు మల్కాపురం పోలీసులను ఆశ్రయించడంతో కత్తిర కనకడును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఎస్‌ఐ దేవుడమ్మ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నత్తనడక పనులతో అగచాట్లు

- 8 మాసాలుగా సాగుతున్న దువ్వాడ రైల్వేస్టేషన్ రోడ్డు పనులు
- మూతపడిన ప్రధాన రహదారి
- ఇక్కట్లకు గురవుతున్న స్థానికులు



ప్రత్యామ్నయమైన ఇరుకు రోడ్డులో వేసిన డెబ్రిస్, చెత్తా చెదారం



కూర్మన్నపాలెం పాత ఊళ్లోకి వెళ్లే రహదారిలో కల్వర్టు నిర్మాణం కోసం మూసివేసిన రహదారి

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ రహదారి విస్తరణ పనులు కొనసాగుతుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎనిమిది మాసాలుగా పనులు జరుగుతుండటం.. రోడ్లు, కల్వర్టుల నిర్మాణ పనుల్లో జాప్యం కారణంగా వేలాది మంది స్థానికులు ఇక్కట్లకు గురవుతున్నారు. కూర్మన్నపాలెం పాతూరు జంక్షన్ నుంచి ఐటీఐకి వెళ్లే ప్రధాన మార్గంలో కల్వర్టు నిర్మిస్తున్నారు. రహదారి విస్తరణ, డ్రైనేజీ నిర్మాణంతో పాటు కల్వర్టు నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో నెల రోజుల నుంచి ఈ రహదారి మూసివేయడం, ప్రత్యామ్నయంగా ఉన్న వీధి రోడ్డు ఇరుకుగా ఉండటంతో రాకపోకలు సాఫీగా సాగక పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే రామాలయం (ముస్తఫా బహుళ అంతస్తుకు ఎదురుగా) రహదారి మీదుగా రాకపోకలు సాగించేందుకు వీలున్నా స్టేషన్ రహదారికి ఆరంభంలో ఉన్న ఇంటి శిథిలాలు ఇరుకు రోడ్డు మధ్యలోనే డంప్ చేసి వదిలేయడంతో అటు కూడా ప్రయాణానికి వీలు కాక ఇక్కట్లకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు.

ఘనంగా సహస్ర నామార్చన

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేసి1001 నామాలను పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.

ఎంఈఎస్ సివిలియన్ ఇంజినీర్ల సమస్యలు పరిష్కరించాలి

సీతంపేట: ఎంఈఎస్‌లో పనిచేస్తున్న సివిలియన్ ఇంజినీర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపి తమకు రావాల్సిన బెనిఫిట్స్‌ను ఎటువంటి వివక్ష లేకుండా అమలు చేయాలని ఆల్ ఇండియా సివిలియన్ ఇంజినీర్స్ అసోసియేషన్ కోరింది. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం సంఘ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కె.రాధాకృష్ణ, సంజీవ్ సుమన్ మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం తమకు ఏఈ నుంచి ఈఈ క్యాడర్ వరకు ప్రమోషన్ ఇచ్చేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. 124 మంది పదోన్నతులు పొందారని చెప్పారు. సర్వేయర్లకు ఇంజినీరింగ్‌తో అనుసంధానం చేస్తూ వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. గ్రేడ్ పే మొత్తాన్ని పెంచాలని, సివిలియన్లకు టైప్ 3, 4 క్వార్టర్లు నిర్మించాలని, కార్యాలయంలో మెస్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు చతుర్వేది, నితీష్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ప్రీస్కూల్ అత్యంత కీలకం

ఎంవీపీకాలనీ: ప్రతి విద్యార్థికి ప్రీస్కూల్ విద్య అత్యంత కీలకమని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జీవీ ప్రసాదరావు అన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–11లో గురుస్థానం ప్లే స్కూల్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ విద్యార్థి పటిష్టమైన పునాది ప్రీస్కూల్ ఎడ్యుకేషన్‌లోనే పడుతుందన్నారు. తల్లిదండ్రులు వారి చిన్నారులను ప్రీస్కూల్ ఎడ్యుకేషన్‌కు పంపించే ముందు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఫరూఖీతో పాటు స్కూల్ డైరెక్టర్ ఎస్.ఖాన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిషా, ప్రిన్సిపాల్ గౌసియా పాల్గొన్నారు.



నూతన శాఖను ప్రారంభిస్తున్న ఏసీపీ ప్రసాదరావు

పరిపాలన విభాగాల పరిశీలన



కార్యాలయాలు పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలోని పలు విభాగాలను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ శనివారం పరిశీలించారు. పరిపాలన భవనంలో పనిచేస్తున్న విభాగాలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. కార్యాలయాల ఆధునికీకరణ, అవసరమైన మార్పులు చేపట్టడం, మరమ్మతులు, తదితర అంశాలపై సిబ్బంది సూచనలు స్వీకరించారు. ప్రతీ విభాగాన్ని పూర్తి స్థాయిలో ఆధునీకీకరించడం, విద్యార్థులకు, ఉద్యోగులకు మరింత సమర్థంగా సేవలు అందించడం లక్ష్యంగా పని చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ వెంట అధికారులు సాంబమూర్తి, గోపాల కృష్ణ, రమణా రెడ్డి, తులసీరామ్, ఇమాన్ ఉన్నారు.

160 మందికి కంటి పరీక్షలు

తగరపువలస : వెంపాడ వెల్ఫేర్ సొసైటీ, భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా శనివారం రామన్నపేట సాయిరవీంద్ర పాఠశాలలో నిర్వహించిన మెగా కంటి వైద్య శిబిరంలో సిబ్బంది 160 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 40 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో ఉచితంగా వీరికి శస్త్ర చికిత్సలు చేయనున్నారు. కళ్ల జోళ్లు అవసరమైన వారికి ఉచితంగా అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాస రెడ్డి, కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్, డాక్టర్ గంగాధర్, క్యాంప్ కో ఆర్డినేటర్ వై.పైడిరాజు, సిబ్బంది ఉష, పవిత్ర, తదితరులు పాల్గొన్నారు.